

గణతంత్ర వేడుకలను విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

భీమవరం: స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ఈ నెల 26న నిర్వహించబోయే 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించిన అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష చేశారు. వేడుకల పర్యవేక్షణ అధికారిగా ఆర్‌డిఒ శ్రీనివాసులురాజును నియమించినట్లు తెలిపారు. బందోబస్తు, జెండా వందనం, కవాతు ఏర్పాట్లను పోలీస్ శాఖ, స్టేజ్ డెకరేషన్, సీటింగ్, పారిశుధ్యం, తాగునీరు ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను డిఇఒ వెంకటరమణ చూడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై స్టాల్స్, శకటాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, ఆర్‌డిఒ కె.శ్రీనివాసులు రాజు, తహశీల్దారు వై.రవికుమార్ పాల్గొన్నారు.

అందరి చూపు నరసాపురం వైపే..!



- ఎంపీ అభ్యర్థి ఎంపిక పై మల్లగుల్లాలు
- స్పష్టతకు రాని రాజకీయ పార్టీలు
- పోటీకి వెనకాడుతున్న అభ్యర్థులు
- వైసిపిలో కూడా ఇదే పరిస్థితి
- అంతు పట్టని నరసాపురం పార్లమెంటు స్థానం రాజకీయం

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల సమీపిస్తున్న వేళ అందరి చూపు నరసాపురం పార్లమెంట్ స్థానం వైపు పడింది. ఎంపీ స్థానానికి ఏ పార్టీ నుంచి ఎవరెవరు బరిలో ఉంటారు, ఏ పార్టీ ఎవరికి అవకాశం కల్పిస్తుందని సార్వత్రా చర్చ సాగుతోంది. అయితే ఎంపీ స్థానం అభ్యర్థి ఎంపికపై రాజకీయ పార్టీలు ఇంకా స్పష్టతకు రాలేదు. ఎంపీ స్థానానికి పోటీ చేసేందుకు అభ్యర్థులు వెనకడుగు వేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. దీంతో అధికార పార్టీ వైసిపితో పాటు టిడిపి, జనసేన, బిజెపి సైతం అభ్యర్థితత్వం ఎంపికపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నరసాపురం పార్లమెంటు స్థానం రాజకీయం అంతు చిక్కని పరిస్థితి ఏర్పడింది.

మరో మూడు నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే ఓటర్ల తుదిజాబితా కూడా వెలువడింది. రాజకీయ పార్టీలు కూడా ఓటర్ల జాబితాపై పోలింగ్ బూత్‌ల వారీగా కసరత్తులు మొదలుపెట్టేశారు. దీంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అయితే అభ్యర్థుల ఎంపికపై మాత్రం ఇప్పటివరకూ ఏ రాజకీయ పార్టీ అధికార ప్రకటన చేయలేదు. ఈ నేపథ్యంలో ఏ రాజకీయ పార్టీ నుంచి ఏ అభ్యర్థి ఎన్నికల బరిలో నిలుస్తారని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా నరసాపురం పార్లమెంటు స్థానం నుంచి ఏ పార్టీ నుంచి ఏ అభ్యర్థి బరిలో ఉంటారా అనేది చర్చనీయంగా మారింది. 2019 ఎన్నికల్లో నర్సాపురం ఎంపీ స్థానానికి త్రిముఖ పోటీ జరిగింది. వైసిపి, టిడిపి, జనసేన, వామపక్షాల ఓటమి మధ్య ప్రధాన పోటీ జరిగింది. వైసీపీ నుంచి కనుమూరి రఘురామ కృష్ణంరాజు, టిడిపి నుంచి వేటుకూరి వెంకట శివరామరాజు, జనసేన కుటమి నుంచి సినీ హీరో కొణిదెల నాగేంద్రబాబు పోటీ చేశారు. ఈ పోటీలో శివరామరాజుపై సుమారు 30 వేల కోట్ల మెజార్టీతో వైసిపి అభ్యర్థి రఘురామ కృష్ణంరాజు విజయం సాధించారు. మూడో స్థానానికి జనసేన పరిమితమైంది. అయితే అధికార పార్టీపై వైరుధ్యం పెంచుకొని రెబల్ ఎంపీగా తయారైన రఘురామ కృష్ణంరాజు నాలుగేళ్ల పాటు ఢిల్లీకి పరిమితమయ్యారు. ఇటీవల సంక్రాంతి నేపథ్యంలో తిరిగి సుదీర్ఘకాలం తర్వాత జిల్లాలో అడుగుపెట్టారు. అప్పటి నుంచి వైసిపిపై అనేక ఆరోపణ అస్త్రాలు సంధిస్తున్నారు. అయితే రాబోయే ఎన్నికల్లో ఈ ఎంపీ స్థానం నుంచి ఏ పార్టీ నుంచి ఏ అభ్యర్థి పోటీ చేస్తారనేది తెలియని పరిస్థితి ఏర్పడింది. ఎంపీ స్థానానికి పోటీ అంటేనే అభ్యర్థులు ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. దీనికి అనేక కారణాలు అండగా నిలుస్తున్నాయి. ఆయా నియోజకవర్గాలకు ప్రాతినిథ్యం వహిస్తున్న ఎంఎల్‌ఎలు, ఎంపీలకు సరైన గౌరవం ఇవ్వట్లేదనే ఆరోపణ ఉంది. పైగా పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాలకూ ఎన్నికల్లో భారీ మొత్తంలో డబ్బులు ముట్టజెప్పాల్సిన పరిస్థితి. దీంతో ఆర్థికంగా పరిపుష్టంగా లేని అభ్యర్థులు పోటీకి ముందుకు రాని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఎంపీ అభ్యర్థులు లేక రాజకీయ పార్టీలు మల్లగుల్లాలు పడుతున్నారు.

అధికార పార్టీ వైసిపిలో అంతర్మదనం

ఎన్నికలు వస్తున్నాయంటే అధికార పార్టీ అన్ని విధాలా సంసిద్ధంగా ఉండాలి. అయితే నరసాపురం ఎంపీ స్థానం అభ్యర్థి ఎంపిక పట్ల ఇప్పటికీ స్పష్టత లేదు. వైసిపి అధిష్టానం నుంచి దీనిపై సరైన క్లారిటీ లేకపోవడంతో పార్టీలో అంతర మధనం ఏర్పడింది. నరసాపురం ఎంపీగా గెలుపొందిన రఘురాం కృష్ణంరాజు పార్లమెంటు పరిధిలోని ప్రజలకు, వైసిపి ప్రభుత్వానికి నాలుగేళ్లుగా దూరంగా ఉన్నారు. అయినా వైసిపి రఘు రామకృష్ణంరాజుపై పార్టీ పరంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. చివరకు పార్లమెంట్ పరిధిలో ఏ ఒక్క నాయకుడికీ ఈ బాధ్యతలు అప్పగించలేదు. దీంతో నాలుగున్నర ఏళ్లుగా ఏడు నియోజకవర్గాలకు ఎంపీ స్థానం అనాదిగా మిగిలింది. అయితే రఘురాం కృష్ణంరాజు మాత్రం ఎంపీ నిధులు తీసుకొచ్చి కొన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేశారు. అయితే ప్రస్తుతం అధికార పార్టీ నుంచి ఈ ఎంపీ స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారన్నది తెలియని పరిస్థితి. గతంలో గోకరాజు రంగరాజు (పెద్ద బుజ్జి) వైసిపిలో చేరారు. అప్పట్లో నరసాపురం ఎంపీ స్థానం నుంచి రంగరాజు పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. అప్పట్లో వైసిపి జిల్లా అధ్యక్షులు బాధ్యతలు కూడా పార్టీ అధిష్టానం రంగరాజుకు అప్పగించింది. కొన్నాళ్ల తర్వాత పార్టీకి దూరంగా ఉన్న రంగరాజు ఇటీవల నరసాపురం ఎంపీ స్థానం నుంచి పోటీ చేస్తారని ప్రచారం సాగింది. వైసిపి అధిష్టానం కూడా ఈ పేరునే ప్రకటించే సమయంలో తాను పోటీ చేయనని చెప్పడంతో ప్రకటన నిలుపుదల చేశారని తెలిసింది. తణుకు, ఎంఎల్‌ఎ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును పోటీకి దిగమని అధిష్టానం చెప్పినప్పటికీ దీనికి ఆయన నిరాకరించారు. ఆచంట ఎంఎల్‌ఎ మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పోటీ చేస్తారని ప్రచారం జరిగినప్పటికీ ఇది కూడా నామరూపం దాల్చలేదు. ఇదిలా ఉండగా మాజీ ఎంపీ కృష్ణంరాజు సతీమణి, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పెద్దమ్మ శ్యామలాదేవి వైసిపి నుంచి పోటీ చేస్తారని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. ఇటీవల కృష్ణంరాజు జయంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన మొగల్తూరులో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి రెండు వేల మందికి వైద్య సేవలందించారు. అలాగే బిసి సామాజిక వర్గానికి చెందిన ప్రస్తుత శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణకు స్వయాన బావ అయిన గుబ్బల తమ్మయ్యను నరసాపురం ఎంపీ బరిలో నిలిపే అవకాశాలు ఉన్నట్లు అధిష్టానం సంకేతాలు పంపించినట్లు సమాచారం. త్వరలో గుబ్బల తమ్మయ్యను నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించబోతున్నట్లు ప్రచారం సాగుతోంది. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా తమ్మయ్య పోటీ చేసి పరాజయం పొందారు.

కూటమి గందరగోళం..

టిడిపి జనసేన కూటమిలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికే ఈ రెండు పార్టీలు పొత్తును ప్రకటించి ఉమ్మడి కార్యాచరణతో కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజా క్షేత్రంలో ముందుకు సాగుతున్నారు. అయితే ఇప్పటివరకు బిజెపి పొత్తుపై ఈ రెండు పార్టీలూ క్లారిటీ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఎంపీ అభ్యర్థి ఎంపికపై స్పష్టత రాలేదు. దీంతో ఈ మూడు పార్టీల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికే నరసాపురం నుంచి తాను పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని వైసిపి రెబల్ ఎంపీ రఘు రామకృష్ణంరాజు ఇటీవల ప్రకటించారు. అయితే ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారా అనేది స్పష్టత ఇవ్వలేదు. మరోవైపు జనసేన టిడిపి కూటమి నుంచి సినీ హీరో నాగేంద్రబాబు మరో మారు పోటీలో ఉంటారని ప్రచారం సాగుతోంది. అయితే ఈ కూటమిలో రఘు రామకృష్ణంరాజుకు అవకాశం దక్కకపోతే బిజెపి నుంచి పోటీలో ఉంటారనే చర్చ సాగుతోంది. బిజెపి ఎంపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ కృష్ణంరాజు భార్య శ్యామలాదేవి బరిలో ఉండొచ్చనే చర్చ సాగుతోంది.

మున్సిపల్ టీచర్ల ధర్నాపై నిర్బంధం

- నేడు జిల్లాలో జరిగే నిరసనలకు అనుమతిలేదంటూ హుకుం
- యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులకు 50 మందికి నోటీసులు జారీ
- మున్సిపల్ ఉపాధ్యాయుల కోసం జల్లెడ పడుతున్న పోలీసులు
- ధర్నాకు వెళ్తే చర్యలు తప్పవంటూ ఫోన్లో బెదిరింపులు
- నోటీస్‌లివ్వడం అప్రజాస్వామికం : యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం



పోలీసుల నుంచి నోటీసులు తీసుకుంటున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

సమాజానికి రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ స్వతంత్రాన్ని అణిచివేసి హక్కులను హరించేవిధంగా వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. తమ హక్కుల కోసం నోరిప్పితే గొంతు నొక్కడం, ఆందోళన బాట పడితే అక్రమ కేసులు పెట్టడం, నిరసన చేపడితే నిర్బంధాన్ని ప్రయోగించడం, ఇవన్నీ దాటుకొని ముందుకు సాగితే దౌర్జన్యానికి దిగడం ప్రభుత్వానికి పరిపాటిగా మారింది. 42 రోజులపాటు అలుపెరగకుండా అంగన్వాడీలు సమ్మె చేసిన పట్టించుకోని ప్రభుత్వం చలో విజయవాడ పిలుపుపై తీవ్ర నిర్బంధాన్ని విధించి దమనకాండ మోగించారు. మహిళలని కూడా చూడకుండా చిత్రహింసలకు గురిచేసి ప్రభుత్వ కర్కసత్వాన్ని చాటుకున్న విషయం తెలిసిందే. ఇది గడిచి మూడు రోజులు కాకుండానే ప్రభుత్వం మరోసారి మున్సిపల్ ఉపాధ్యాయులపై నిర్బంధాన్ని విధించింది. మున్సిపల్ ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25వ తేదీ గురువారం విజయవాడ ధర్నాకు యుటిఎఫ్ పిలుపునిచ్చింది. అయితే ధర్నాకు పోలీసులు అనుమతిచ్చినప్పటికీ అకస్మాత్తుగా అనుమతులను రద్దు చేశారు. రాష్ట్ర కేంద్రంలో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని, లా అండ్ ఆర్డర్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయంటూ పోలీసులు అనుమతులు రద్దు చేశారు. ఈ నేపథ్యంలో యుటిఎఫ్ నాయకత్వం జిల్లా కేంద్రాల పరిధిలో అన్ని మున్సిపల్ పట్టణాల్లో నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చింది. జిల్లాలో భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు నరసాపురం మున్సిపల్ కేంద్రాల్లో సుమారు వెయ్యి మంది మున్సిపల్ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి అనేక సమస్యల మధ్య విధులను నెట్టుకొస్తున్నారు. పలు దఫాలుగా ఆందోళన చేస్తున్నప్పటికీ కనీసం ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిపిఎస్ అకౌంట్స్ ఇవ్వాలని, సర్వీస్ రూల్స్ ఇవ్వాలని, జిఒ 84 రద్దు చేయాలని తదితర సమస్యలపై ధర్నా చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఈ నిరసనపై ప్రభుత్వం నిర్బంధాన్ని విధించింది. యుటిఎఫ్ నేతలు ఉపాధ్యాయులు పనిచేసే చోట, ఇతర చోట్ల పోలీసులు జల్లెడ పట్టారు. కొంతమందికి పోలీసులు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తికి అత్తిలిలో, జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజుకు భీమవరంలో, ప్రధాన కార్యదర్శి ఎకెవి రామభద్రానికి పాలకొల్లులో పోలీసులు 41ఎ నోటీసులు అందజేశారు. అలాగే మరో 50 మంది ఉపాధ్యాయులు ఉపాధ్యాయ నేతలకు ముందస్తు నోటీసులు జారీ చేశారు. ఎటువంటి నిరసనలకూ అనుమతి లేదని, కాదు కూడదని వెళ్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

స్వేచ్ఛ హక్కును హరించే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం అత్యంత దుర్మార్గమని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి విమర్శించారు. నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంటుందని, నిరసన తెలిపే ప్రతిసారీ తమకు నోటీసులివ్వడం ప్రజాస్వామికమన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి మున్సిపల్ ఉపాధ్యాయులు అనేక సమస్యలతో సతమతమవుతున్నా పట్టించుకోని ప్రభుత్వం ఉపాధ్యాయ నేతలు ఉపాధ్యాయులపై నిర్బంధాన్ని ప్రయోగించడం దారుణం అన్నారు. శాంతియుతంగా పోరాటం చేస్తుంటే ఈ విధంగా వ్యవహరించడం హేయమైన చర్య అని విమర్శించారు. అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా నేడు నిరసనలు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు.

ఎన్నికల సీజర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ఎన్నికలకు సంబంధించి సీజర్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని వివిధ శాఖల ఎన్ఫోర్స్‌మెంట్ అధికారాలను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఎన్నికల సీజర్స్‌కు సంబంధించి ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులతో సమావేశమై శాఖల వారీగా ఎన్ఫోర్స్‌మెంట్ విధి విధానాలను సమీక్షించారు. సీజర్స్‌కు సంబంధించిన ఎఫ్ఐఆర్, పట్టుబడిన వస్తువులు, నగదు, తదితర అంశాలన్నింటినీ పక్కాగా యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ బి.శివన్నారాయణ రెడ్డి, సెబ్ అడిషనల్ ఎస్‌పి ఎటివి రవికుమార్, జిల్లా ఆడిట్ అధికారి కెఎన్.వెంకటేశ్వరరావు, ఇన్కమ్ టాక్స్ అధికారి కె.సత్యనారాయణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

పాఠశాలల్లో మరుగుదొడ్ల యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మనబడి - నేడు పనులపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మండలాలు వారీగా పనులు ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర వాటికి మొదటి ప్రాధాన్యతిచ్చి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, సమగ్ర శిక్ష పిఒ పి.శ్యామ్‌సుందర్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

భూహక్కు చట్టం రద్దు చేయాలి



మాట్లాడుతున్న జెఎసి కన్వీనర్ నీలాతి రమేష్

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు మొగళ్ల వెంకటరమణరావు కోరారు. కాళ్లలో భీమవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జెఎసి కన్వీనర్ నీలాతి రమేష్ మాట్లాడుతూ భూ యాజమాన్య హక్కుల చట్టం వల్ల ప్రజలకు జరిగే నష్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, సభ్యులు ఉండవల్లి రమేష్‌నాయుడు, బొక్కా దామోదరరావు, కెవి.రమేష్, అల్లూరి శివాజీ, మొగళ్ల చిన నరసింహరావు, మొగళ్ల పెద నరసింహరావు, చందు, వంశీ, నాయకులు ఆరేటి దిలీప్, ఎరుబండి రామాంజనేయులు, పుప్పాల బుజ్జి, మొగళ్ల షావుకారు, శిరిగినీడి సుబ్బయ్య, ఆరేటి సుబ్బారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటర్ల దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహణ, స్వీప్ యాక్టివిటిస్‌కు సంబంధించి అధికారులకు జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని, ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి, ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎఒ వైకెవి.అప్పారావు, డిటి ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని మున్సిపల్ స్కూల్ స్వీపర్ల ధర్నా

ప్రజాశక్తి - తణుకు రూరల్

మున్సిపల్ స్కూల్ స్వీపర్లకు తొమ్మిది నెలలు బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, సీనియర్ నాయకులు గార రంగారావు మాట్లాడారు. ఏ ప్రభుత్వం వచ్చినా చేస్తున్న పనికి తగిన వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. స్కూల్స్ స్వీపర్స్ ఉదయం నుండి మధ్యాహ్నం వరకూ పని చేస్తున్నారన్నారు. ఏలూరులో సక్రమంగా వేతనాలు కార్పొరేషన్ నుంచి ఇస్తున్నారని, ఇక్కడ మాత్రమే 9 నెలలుగా ఇవ్వక పోవడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శారద, కె.సత్యవతి, పి.జయకుమారి, ఎన్.శ్రీదేవి, పి.ధనలక్ష్మి, బంగారమ్మ, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలకు నిధులు సర్దుబాటు



ప్రజాప్రతినిధులతో చర్చిస్తున్న విద్యాశాఖాధికారులు

ప్రజాశక్తి - వీరవాసరం

తోలేరు పంచాయతీ పరిధిలోని పడమటిపాలెంలో అసంపూర్ణంగా ఉన్న మండల ప్రాథమిక పాఠశాల నిర్మాణం పూర్తి చేయడానికి రూ.ఆరు లక్షల నిధులు సర్దుబాటు చేయాలంటూ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం పడమటిపాలెం పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ పాఠశాలలో గత కొన్ని సంవత్సరాలుగా పోలింగ్ బూత్‌ను నిర్వహిస్తున్నారు. నాడు-నేడు నిధులతో నిర్మిస్తున్న ఈ పాఠశాల నిర్మాణం పూర్తికాకపోవడంతో పోలింగ్ బూత్ నిర్వహణ పట్ల సందిగ్ధత నెలకొంది. దీంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తోలేరు ఉన్నత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ బూత్‌ను తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో ఓటర్ల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బూత్ మార్పు విషయాన్ని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల పడమటిపాలెంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ పోలింగ్ బూత్‌ను ఇక్కడే ఏర్పాటు చేయాలని పాఠశాల నిర్మాణం పూర్తి చేయడానికి అవసరమైన నిధులను సర్దుబాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారికి ఆదేశాలిచ్చారు. దీంతో డిఇఒ వెంకటరమణ, ఎస్ఎస్ఎ పిఒ పి.శ్యాంసుందర్, ఎంఇఒ-2 శ్రీమన్నారాయణలు పాఠశాలను సందర్శించి ఎంపిపి దుర్గాభవాని, సర్పంచి వేండ్ర లీలావెంకటకృష్ణలతో చర్చించి పాఠశాల నిర్మాణం పూర్తి చేసేందుకు నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. నడపనవారిపాలెంలో నిలిచిపోయిన పాఠశాల విషయం కూడా నిధుల విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు.

షైనీకి ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి - ఆకివీడు




పురస్కారం అందుకుంటున్న షైనీ

మండలంలోని అజ్జామూరు గ్రామానికి చెందిన గంటా షైనీ బుధవారం కలెక్టర్ నుంచి ప్రతిభా పురస్కారం అందుకుంది. భీమవరంలో కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు ఈ పురస్కారం అందించారు. బాల్యం నుంచి షైనీ కరాటేలో మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పురస్కారాలను, అవార్డులను గెలుపొందింది. రింగ్ డాన్స్ చేయడంలో రాష్ట్ర స్థాయిలో పలువురితో పోటీ పడింది. పలు అవార్డులు గెలుపొందిన షైనీకి జిల్లా కలెక్టర్ ఈ పురస్కారాన్ని అందించినట్లు షైనీ కోచ్ ఆమె తండ్రి గంటా శ్రీను తెలిపారు.

క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక వికాసం

ప్రజాశక్తి - నరసాపురం



క్రికెట్ ఆడుతున్న ప్రసాదరాజు

శారీరక దారుఢ్యం, మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలను నరసాపురం వైఎన్ కాలేజీ ప్రాంగణంలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమలో ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్‌తో కలిసి ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ నియోజకవర్గస్థాయిలో గెలుపొందిన వారిని ఎంపిక చేసి జిల్లా, రాష్ట్ర స్థాయిలకు పంపించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ క్రీడల్లో ప్రావీణ్యం గల వారిని గుర్తించి ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన పిఇటిలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, కోకో ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులందరూ క్రీడా స్ఫూర్తితో ఆడి విజయం సాధించాలన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయికి వెళ్లి నరసాపురం పేరు నిలబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, వైఎన్ కాలేజీ ప్రిన్సిపల్ కనకారావు, ఎంఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు చల్లారావు, మొగల్తూరు జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, తహశీల్దార్లు సయ్యద్ మౌలానా ఫజిల్, జి.అనితకుమారి, ఎంపిడిఒలు వీరభద్రరావు, పిఇటిలు, సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - తణుకు రూరల్

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి 9వ తేదీ శనివారం తణుకు జిల్లా కోర్టుల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తణుకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్‌పర్సన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. ఈ సందర్భంగా జడ్జి సత్యవతి మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని సివిల్ కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాద భీమా కేసులు, ప్రీలిటిగేషన్(బ్యాంకు, బిఎస్ఎన్ఎల్) కేసులు కక్షిదారులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని తెలిపారు.

తాడేపల్లిగూడెం సిఐగా నాగరాజు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



తాడేపల్లిగూడెం పట్టణ సిఐగా ఎ.సుబ్రహ్మణ్యం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సిఐగా పని చేసిన నాగరాజు ఉద్యోగోన్నతితో విజయవాడ సిటీకి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సిఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతలను సమర్థవంతంగా నిర్వహించడానికి కృషి చేస్తానని తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి – పోడూరు

కాలుష్యాన్ని నియంత్రించి పర్యావరణాన్ని పరిరక్షించాలని వైసిపి మట్టపర్రు గ్రామ కమిటీ అధ్యక్షులు కొల్లాబత్తుల రవికుమార్ అన్నారు. మట్టపర్రు ఎఎ పేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం గోదావరి పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గ్రామ కమిటీ అధ్యక్షులు రవికుమార్, జనార్థన సొసైటీ డైరెక్టర్ పెన్మెచ్చి ముత్యాలరావు, మాజీ ఉప సర్పంచి కుసుమ సుఖకర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వాతావరణంలో కాలుష్యాన్ని నియంత్రించి పర్యావరణాన్ని పరిరక్షించడానికి మొక్కలు, అటవీ సంపదను పెంచడం ఎంతో అవసరమన్నారు. గోదావరి పర్యావరణ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వారణాసి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బి.చిట్టిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గోదావరి పర్యావరణ పరిరక్షణ సమితి జాయింట్ సెక్రటరీ వెన్నేటి శేఖర్, సీనియర్ పాత్రికేయులు పృథ్వరాయ వసంత్, స్థానిక నాయకులు బండి సుదర్శనరావు, నల్లిమిల్లి బాలరాజు, ఉన్నమట్ల భాస్కరరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి – ఆచంట

ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తుందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని భీమలాపురం గ్రామానికి చెందిన కట్టా వెంకటేశ్వర్లు కుమారుడు నేపాల్ పర్ణ అరుణ్ నుంచి కాలేయం వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. కాలేయం మార్పిడి నిమిత్తం సిఎంఆర్ఎఫ్, ఎల్ఓసి నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు శ్రీరంగనాథరాజు తెలిపారు. ఆ చెక్కును తూర్పుపాలెంలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, వైసిపి నాయకులు మొల్లేటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగం మండలాధ్యక్షులుగా నాగమురళి

ప్రజాశక్తి – పాలకొల్లు

వైసిపి యువజన విభాగ పాలకొల్లు మండలాధ్యక్షులుగా శివదేవుని చిక్కాల ఉప సర్పంచి ఆకుల నాగమురళి నియమితులైనట్లు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) తెలిపారు. వైసిపి ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌ఛార్జి రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సూచనల మేరకు యువజన విభాగం పటిష్టతలో భాగంగా మురళిని నియమించినట్లు గోపీ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మురళిని అభినందించారు.

గణతంత్ర వేడుకలకు గోపాలంబాబు దంపతులు

ప్రజాశక్తి – ఉండి

మండలంలోని కోలమూరు గ్రామానికి చెందిన గొట్టేటి గోపాలం బాబు, మేరీ మిల్లన్ దంపతులు ఈ నెల 26వ తేదీన ఢిల్లీలో జరగనున్న గణతంత్ర వేడుకల్లో ప్రధానమంత్రి విశిష్ట పథకంలో భాగంగా చర్మ కార్మికుల విభాగంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వద్ద నుంచి ఆహ్వానం రావడంతో ఆనందం వ్యక్తం చేశారు. గణతంత్ర వేడుకలకు రాష్ట్రంలో పదిమందికి ఆహ్వానం అందగా వారిలో తాము ఒకరిగా ఉండటం చాలా సంతోషాన్ని ఇచ్చిందని గోపాలం దంపతులు తెలిపారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

ప్రజాశక్తి – పాలకొల్లు

ప్రజా ఆరోగ్య సంరక్షణకు సిఎం జగన్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా భవనంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించాలని కోరారు. రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లోని ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో సిఎం జగన్ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు గుడాల సాయి బాలాజీ, జిల్లా యువజన విభాగ జాయింట్ సెక్రటరీ పెన్మెత్స కృష్ణాజీ, జమ్ము కాశీ విశ్వనాథం, ఈద మధు మూర్తి, మున్సిపల్ కమిషనర్ శేషాద్రి పాల్గొన్నారు.

నరసాపురం :జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు అన్నారు. నరసాపురం మున్సిపాలిటీ పరిధిలో 15, 20, వార్డులకు సంబంధించి పీచుపాలెం సచివాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


కాళ్ల : ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఎంఎల్ఎ రామరాజు

'టిడిపిని మరోసారి ఆశీర్వదించాలి'

ప్రజాశక్తి – కాళ్ల

టిడిపిని మరోసారి ఆశీర్వదించాలని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని జక్కరం గ్రామంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా టిడిపి శ్రేణులు జక్కరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైసిపి చేస్తున్న ఆగడాలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలో ప్రజలు తాగునీటి సమస్యతో పాటు రోడ్లు, డ్రెయినేజీ, ఇళ్లస్థలాల సమస్యలు ఉన్నాయన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు గుండాబత్తుల వెంకట నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు బండారు గోపాలరావు, తెలుగు యువత మండలాధ్యక్షులు మంతెన కోదండరామరాజు, పి.సత్యనారాయణరాజు, మంతెన సుబ్బారాజు, పుప్పాల బుజ్జి, మొగళ్ల మాధవరావు, తోట ఫణిబాబు పాల్గొన్నారు.

కోళ్లపూరులో 'ఇంటింటికి రాంబాబు'

ఆకివీడు: అభివృద్ధిలో నియోజకవర్గం పూర్తిగా వెనుకపడిపోయిందని ఎంఎల్ఎ రామరాజు అన్నారు. చేపట్టారు. మండలంలోని కోళ్లపూరు గ్రామంలో బుధవారం ఇంటింటికి రాంబాబు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్, పార్టీ నాయకులు బొల్లం వెంకట్రావు, మాజీ సర్పంచి సుజాత, కోపెల్ల సాయిబాబా, నౌకోట్ల రామారావు పాల్గొన్నారు.

మొగల్తూరు :రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని ఆ పార్టీ మొగల్తూరు మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజు అన్నారు. బుధవారం సాయంత్రం మొగల్తూరు పంచాయతీ పరిధి గోడవారిపేటలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ముద్రించిన మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించి వివరించారు. ఈ కార్యక్రమంలో బొల్లా చంటి, పితాని శేఖర్, రాజు, చెల్లిబోయిన పెద్దిరాజు పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి – కాళ్ల

మండలంలోని జువ్వలపాలెంలో పొలిమేరగట్టు తుమ్మగుంట చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. కాళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొవ్వూరుకు చెందిన వడ్లమూడి వెంకటరాజు (37) అతిగా మద్యం తాగి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మృతదేహం నీటిపై తేలి ఉండటాన్ని స్థానికులు గమనించి కాళ్ల పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం


నరసాపురంలో...

ప్రజాశక్తి – నరసాపురం

జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వనితా క్లబ్ ఆధ్వర్యంలో నరసాపురం భాష్యం స్కూల్‌లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు, కాపు వనితా క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ డాక్టర్ రాజ్యలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో బాలికలు అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. చెడు స్పర్శకు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఆంజనేయులు, వనితా క్లబ్ అధ్యక్షురాలు పుప్పాల ఉమా మహేశ్వరి, కార్యదర్శి బండి స్వర్ణలత, కోశాధికారి రంగినీడి భరణి, తోట భారతి, పుప్పాల ఉషా కమల, శశికళ, తోట అరుణ, ఝాన్సీ, వెంకటరమణ, సుంకర రాజకుమారి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు చదువుపై దృష్టి సారించాలని, చదువు ద్వారానే సమాజంలో అసమానతలు పోగొట్టవచ్చని మాజీ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నరసాపురం రాయపేటలో ఐసిడిఎస్, లెనిన్ హైస్కూల్ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్.గీతాబాల, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ఆడపిల్లలను విద్యావంతులుగా మారుద్దాం, నవసమాజ నిర్మాణానికి బాటలు వేద్దామని లయన్ లంకా శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ ఆధ్వర్యంలో బుధవారం లయన్ లంకా శ్రీనివాస్ సహకారంతో స్థానిక బాలిక హైస్కూలులో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కమల మాట్లాడుతూ బాలికలు ఈ వయసులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గవర్నర్ మాణిక్యాలరావు, జోన్ చైర్ పర్సన్ మురళీకృష్ణరాజు సూచనల మేరకు అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి టాపర్‌కు లయన్ పదం గుప్తా రూ.10,116 నగదు బహుమతి అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబికా యోగా సెంటర్ ఫౌండర్ లయన్ చిక్కాల భ్రమరాంబికా, అభయం లియో లయన్స్ ఆశా, వశిష్ఠ లియో అమృత నందిని, లియో స్వీటీ, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : భేటీ బచావో – భేటి పడావో కార్యక్రమంలో భాగంగా జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమాన్ని చిన అమిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేగేశ్న అనురాధ, స్టాఫ్ సెక్రటరీ, జనవిజ్ఞాన జిల్లా అధ్యక్షులు చింతపల్లి ప్రసాదరావు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు భిమ్మ రాము మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పికెడి.రాజ్యలక్ష్మి, పి.సునీత, సుందరి, పి.అన్నపూర్ణ, జె.శకుంతల, ఎం.సుభద్రసూర్యకుమారి, ఎస్.రమాజ్యోతి, ఎ.పద్మ, కె.ఉమాదేవి, తులసి, రాధిక, రవిరాజు, టి.అప్పన్న, జి.శ్రీనివాస్, జి.నాగేశ్వరరావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గణపవరం : బాలికల పట్ల ప్రతిఒక్కరూ ఆదరణ భావం కలిగి ఉండాలని గణపవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మాలకుమారి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక డిగ్రీ కాలేజీలో జరిగిన సమావేశానికి నిర్మలాకుమారి అధ్యక్షత వహిస్తూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు పిహెచ్‌సి డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో లంకలకోడేరు హైస్కూల్ వద్ద బాలికలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, పిహెచ్‌ఎన్‌పి.ఎలిజబెత్, ఎఎన్ఎం రోజాకమల, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగల్తూరు : బాలికల హక్కులకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని సిడిపిఒ ఊర్మిళ విద్యార్థులకు సూచించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం బాలిక దినోత్సవం పురస్కరించుకుని మొగల్తూరులోని పెనుమత్స రంగరాజా జెడ్‌పి ఉన్నత పాఠశాలలో బాలికల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ధమాని రవిశంకర్, మహిళా పోలీస్ సుధారాణి, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు : ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యలమంచిలి మండలం, పాలకొల్లు పట్టణ ఫైనల్స్ క్రికెట్ మ్యాచ్‌ను డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా గుడాల గోపీ తనయుడు సాయిబాలాజీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద్‌ప్రకాష్, వైసిపి నేతలు చందక సత్తిబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దపాటి పెద్దిరాజు, రాష్ట్ర మహిళా సెక్రటరీ మద్దా చంద్రకళ, రాష్ట్ర మహిళా జాయింట్ సెక్రటరీ కర్రా జయసరిత, దేవ రాజేష్, పి.కృష్ణాజీ, మానుకొండ శ్రీనుబాబు, మోర్త గిరీష్ , కెల్లా దుర్గారావు, పాలంకి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన జానకీరామ్

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ జానకిరామ్ బుధవారం విజయవాడ రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంవత్సరంలో ఉద్యాన విశ్వవిద్యాలయం చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి, ఈ మధ్యకాలంలో విశ్వవిద్యాలయం సాధించిన పురోగతి గురించి గవర్నర్‌కి తెలిపారు.

జాతీయ యువజనోత్సవాలకు 'విష్ణు' విద్యార్థులు

ప్రజాశక్తి – భీమవరం రూరల్

నాసిక్‌లో జరిగిన జాతీయ యువజనోత్సవాలకు విఐటి నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు డాక్టర్ బివి.రాజు ఫౌండేషన్, విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వారి విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ డాక్టర్ మంగం వేణు తెలిపారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏడాది జనవరి 12 నుంచి 16 తేదీల్లో భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, జాతీయ సేవా పథకం సంయుక్తంగా జాతీయ యువజనోత్సవాలు నిర్వహిస్తారని, ఈ ఏడాది వీటిని మహారాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నాసిక్‌లో నిర్వహించారని తెలిపారు. దీనిలో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి జెఎన్‌టియుకె ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసిందని ఆయన తెలిపారు. ఈ విధంగా ఎంపికైన ఆరుగురిలో ముగ్గురు విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన వారేనని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ గంగరాజును డైరెక్టర్ డాక్టర్ దశిక సూర్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ మంగం వేణు, వైస్ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి అభినందించారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి – ఆచంట (పెనుమంట్ర)

గ్రామాల్లో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు నిర్వహించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. మండలంలోని ఆలమూరులో దశాబ్దాల కాలంగా సరైన శ్మశానవాటికలు లేక దళితులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, దళితులకు శ్మశానవాటిక స్థలం కేటాయించాలని పుష్పరాజ్ ఆధ్వర్యంలో ఆలమూరులో టెంట్ వేసి గ్రామస్తులు బుధవారం నిరసన తెలిపారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పుష్ప రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ జిఒ ప్రకారం దళితులకు రెండు ఎకరాల శ్మశానవాటిక స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంది జయరాజు, జిల్లా అధ్యక్షులు నేతల సువర్ణరాజు, పెనుమంట్ర మండలాధ్యక్షులు వెంకటేశ్వరరావు, నాగరాజు, మాత వెంకటేశ్వర్లు, మల్లిపూడి బుచ్చిబాబు, బత్తుల మధు, ఎంపిటిసి సభ్యులు ఆశలత, వార్డ్ మెంబర్ మార్తా, విమల, సాల్మాన్ రాజు, పిట్టా వినోద్‌కుమార్, చిగురుపాటి రాజేష్, చిల్లే రాజకుమార్, సత్యనారాయణ, బాబురాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి వ్యవస్థలో డ్రైవర్ల పాత్ర కీలకం

ప్రజాశక్తి – భీమవరం రూరల్

ఆర్‌టిసి వ్యవస్థలో డ్రైవర్ పాత్ర చాలా కీలకమని, రోజుకు వేలాది మందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్లు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తారని ఆర్‌టిసి డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి అన్నారు. భీమవరం ఆర్‌టిసి స్టాండ్‌లో డ్రైవర్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ డ్రైవర్ల విధులకు కులమతాలు లేవని, ప్రయాణికుల సంక్షేమమే ధ్యేయంగా డ్రైవర్లు ఉంటారన్నారు. ఎండైనా, వానైనా, మంచు ఉన్నా లెక్క చేయకుండా డ్రైవర్లు విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. సిఐ సురేష్ మాట్లాడుతూ డ్రైవర్లు రాత్రి పగలు కూడా ప్రయాణికులకు గమ్య స్థానాలకు చేర్చడంలో ముఖ్య పాత్ర పోషిస్తారన్నారు. చెరుకువాడ రంగసాయి డ్రైవర్ల విశిష్టతను వివరించారు. అనంతరం ఆరుగురు ఉత్తమ ఆర్‌టిసి డ్రైవర్లు ఆర్‌వి.రాజు, టివి.రాజు, కెవి.రావు, కెవి.రాజు, ఎంకె.రావు, టిపి.రాజులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎన్ఆర్, ఆదిత్య కళాశాల విద్యార్థులు, ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.వీరయ్యచౌదరి బుధవారం తాడేపల్లిగూడెం డిపోను సందర్శించారు. ప్రయాణికులకు సురక్షిత ప్రయాణం అందిస్తున్నందుకు డ్రైవర్లకు ధన్యవాదాలు తెలిపి పువ్వులు, పెన్నులు, చాక్లెట్లు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యారేజ్ సిబ్బంది బస్సులను ప్రమాదరహితంగా మెయింటెనెన్స్ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి, కమర్షియల్ మేనేజర్ జిఎల్‌పి.సుబ్బారావు, అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, సూపర్‌వైజర్లు రమణ, చిట్టిబాబు, అసోసియేషన్ నాయకులు, డ్రైవర్లు గ్యారేజ్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన జెఎన్‌టియుకె చెస్ శిక్షణ శిబిరం

భీమవరం రూరల్ :భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 20వ తేదీ నుంచి జరుగుతున్న జెఎన్‌టియుకె మెన్ చెస్ సౌత్ జోన్ టీం శిక్షణ కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు తిరుచునాపల్లిలోని భారతీ దాసన్ యూనివర్సిటీలో జరిగే పోటీలకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు ప్రత్యేకంగా అభినందించారు. జెఎన్‌టియుకె తరపున సౌత్ జోన్‌కు ఎంపికైన క్రీడాకారుల వివరాలను కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.సత్యనారాయణరాజు వివరాలు అందిస్తూ విజయవాడ ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బిజెఎస్‌కె రణధీర్, సూరంపూడి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన నాగ దిలీప్, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎస్ఎల్‌డి.విజయ్, పిఎస్ఆర్.కార్తీక్, ఏలూరు రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సిహెచ్.ఆదిత్య కృష్ణసాయి, అమలాపురం శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన కె.గౌతమ్‌ధర్మ ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ డాక్టర్ సిహెచ్.హరిమోహన్, జి.సారిక, అవినాష్ ఉన్నారు.

నిరూపయోగ చెక్కు బుక్కులు దహనం

ప్రజాశక్తి – భీమవరం

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఖజానా కార్యాలయానికి సంబంధించి నిరుపయోగంగా ఉన్న చెక్కు బుక్కులను దహనం చేసినట్లు జిల్లా ఖజానా అధికారి అడారి గణేష్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్ ఆవరణలో రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, ఖజానా అధికారుల సమక్షంలో ఖజానా కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న చెకుబుకులను దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిటిఒ గణేష్ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఎన్నో ఏళ్లగా నిరూపయంగా ఉన్న వివిధ రకాల చెక్కు బుక్కులు దహనం చేశామన్నారు. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు జిల్లా జాయింట్ కలెక్టరు ఆధ్వర్యంలో పదిమంది జిల్లా స్థాయి అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఏడు ఉప ఖజానా కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉన్న 2,044 చెక్కు బుక్కులలోని 60,800 చెక్కులతో సహా దహనం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆగ్నిమాపకదళ అధికారి బి.శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు కె.సంధ్య, దేవాదాయ, ధర్మాదాయ శాఖాధికారి ఇవి.సుబ్బారావు, ఎటిఒలు అబ్దుల్ హాకీమ్, బి.లీల, ఎస్‌టిఒ ఎ.రవి వర్మ, జిల్లా ఉప ఖజానా అధికార్లు, రెవెన్యూ, పోలీసు, జిల్లా ఖజానా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల మళ్లింపుపై విచారణ జరపాలి

వేల్పూరు సర్పంచి కృష్ణవేణి

ప్రజాశక్తి – తణుకు రూరల్

వేల్పూరు గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు సర్పంచి ప్రమేయం లేకుండా సుమారు రూ.17.90 లక్షలు పంచాయతీ కార్యదర్శి పర్సనల్ ఖాతాకు మళ్లించుకున్నారని, దానిపై తక్షణం అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పంచాయతీ సర్పంచి విశ్వనాథం కృష్ణవేణి డిమాండ్ చేశారు. బుధవారం వేల్పూరులోని టిడిపి కార్యాలయంలో సర్పంచి విశ్వనాథం కృష్ణవేణి అధ్యక్షతన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ వేల్పూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా గంగాధరరావు విధులు నిర్వహిస్తూ పంచాయితీ 15వ ఆర్థిక సంఘం నిధులు సర్పంచి ప్రమేయం లేకుండా సుమారు రూ.17.90 లక్షలు కార్యదర్శి పర్సనల్ ఖాతాకు మళ్లించుకున్నారన్నారు. టిడిపి గ్రామ అధికార ప్రతినిధి వల్లూరి మోహన్ మాట్లాడుతూ గ్రామంలో అబద్దాలు, అసత్యాలతో వైసిపి కరపత్రం విడుదల చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి గుణ్ణం రాజారావు, వార్డు సభ్యులు రెడ్డి శివరామకృష్ణ, గడిగట్ల జయచందు, గుణ్ణం శ్రీదేవి, సుంకర వెంకట్రావు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి – గణపవరం

క్రీడలపై యువత ఆసక్తి కలిగి ఉండాలని ఏలూరు ఆర్‌డిఒ ఎండి ఖాజావలి అన్నారు. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా బుధవారం గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉంగుటూరు నియోజకవర్గస్థాయి వాలీబాల్, కోకో, ఆటలపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు క్రీడారంగంపై ఆసక్తి కలిగించడానికి ప్రభుత్వం ఆటల పోటీలు నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గణపవరం, నిడమర్రు తహశీల్దార్లు పి.లక్ష్మి, బి.సాయిరాజ్, గణపవరం ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, ఎంఇఒ పి.శేషు, గణపవరం సర్పంచి మూరా అలంకారం సూర్యబలిజ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు సలాది రత్నదుర్గాకుమారి, వైసిపి నాయకులు దండురాము, కాకర్ల శ్రీను, హైస్కూల్ పీడీ ఎం.పద్మావతి, విఆర్ఓలు క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆచంట :మట్టిలో మాణిక్యాల్లాంటి క్రీడాకారులను వెలికితీయడమే ఆడుదాం ఆంధ్రా ముఖ్య ఉద్దేశమని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. కొడమంచిలి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆడుదాం ఆంధ్రా ఆచంట నియోజకవర్గస్థాయిలో వాలీబాల్ టోర్నమెంట్‌ను బుధవారం సీతారామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నాడూ లేనివిధంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ సిఎం జగన్ ఇటువంటి క్రీడలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. నియోజకవర్గంలో క్రీడాకారులను ప్రోత్సహిస్తూ అనేక ఆటల పోటీలను స్థానిక ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో నిర్వహిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలను కొడమంచిలిలో నిర్వహించడానికి అవకాశం కల్పించిన ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఎంపిడిఒ నరసింహప్రసాద్‌శ్రీనివాస్ దొర, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంఇఒ రాజేంద్రప్రసాద్, నరసాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్ సుభాష్ రెడ్డి, ఇఒపిఆర్‌డి మూర్తి బాబు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కృష్ణారెడ్డి, పిఇటిలు చిరంజీవి నరేష్, కోనరవి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి, సత్యనారాయణ పాల్గొన్నారు.


గణపరం : పోటీలను ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ


మహిళా కబడ్డీ విజేత ఎన్ఆర్‌పి అగ్రహారం జట్టు

ఉండి : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన నియోజకవర్గ మహిళా కబడ్డీ పోటీల్లో మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం జట్టు విజేతగా నిలిచింది. మండలంలోని ఉప్పులూరులో నిర్వహించిన నియోజకవర్గ పోటీల్లో ఆకివీడు మండలం చెరుకుమిల్లి జట్టుపై ఉండి మండలం ఎన్ఆర్‌పి అగ్రహారం జట్టు విజయం సాధించిందని ఆ గ్రామ సర్పంచి సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో విజేతగా నిలిచిన మహిళా కబడ్డీ జట్టును నియోజకవర్గ ఇన్‌ఛార్జి, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, జెడ్‌పిటిసి సభ్యులు రణస్థల కనకదుర్గ మహంకాళి, ఎంపిపి ఇందుకూరి శ్రీహరినారాయణరాజు ఫోన్‌లో విజేతలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు మాట్లాడారు. ఈ కబడ్డీ పోటీలను బిసి సంఘం జిల్లా అధ్యక్షులు సూరవరపు వెంకటాచార్యులు, ఎంపిటిసి సభ్యులు మున్నలూరి సువర్ణలక్ష్మిశ్రీనివాస్, ఉప్పులూరు ఎంపిటిసి సభ్యులు నిమ్మల కేశవ్ కుమార్ పాల్గొని అగ్రహారం జట్టుకు మద్దతుగా నిలిచారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి – ఆచంట

అంతర్జాతీయ వేదికలపై రాష్ట్ర విద్యార్థులు తమ తమ ప్రతిభను కనబరచాలనే ఉద్దేశంతో సిఎం జగన్ ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం చేపట్టారని ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని వల్లూరు, కరుగోరిమిల్లి, కోడేరు, భీమలాపురం జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జగనన్న ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను ఆయన చేతుల మీదుగా బుధవారం అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రయివేట్ స్కూళ్లకు దీటుగా నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలను ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, సర్పంచి బోడపాటి బుల్లియ్య, సొసైటీ ఛైర్మన్ నారిన వెంకట సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు ఏడిద రామలక్ష్మి, ఇన్‌ఛార్జి ముత్యాల నాగేశ్వరరావు, మొల్లేటి రామకృష్ణ, ఎంఇఒలు రాజేంద్రప్రసాద్, ఉషారాణి, ఉపాధ్యాయులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.


డైరీ ఆవిష్కరిస్తున్న మోషేన్‌రాజు

అసమానతలపై ఐక్యంగా పోరాడాలి

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

ప్రజాశక్తి – భీమవరం

అంబేద్కర్ స్ఫూర్తితో సమాజంలో వివక్ష, అసమానతలపై ఐక్యంగా పోరాడాలని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో కెవిపిఎస్ రాష్ట్రస్థాయి డైరీని మోషన్‌రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోషన్‌రాజు మాట్లాడుతూ సమాజంలో అసమానతలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ దేశంలో మతోన్మాద శక్తులు రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు కింతాడ రమేష్ పాల్గొన్నారు.

అన్ని దానాలోకెల్లా అన్నదానం మిన్న

ప్రజాశక్తి – ఉండి

దానాలోకెల్లా అన్నదానం గొప్పదని కలిసిపూడి ఎంపిటిసి సభ్యులు, విశ్రాంత జవాన్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల మాజీ అధ్యక్షులు దంగేటి రామలింగేశ్వరరావు (కలిసిపూడి రాము) అన్నారు. అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం తమకు ఎంతగానో ఆనందాన్నిచ్చిందన్నారు. ఆ సంతోషాన్ని మహదేవపట్నం గ్రామంలోని సన్‌రైజ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలోని వృద్ధులతో పంచుకున్నట్లు వారు తెలిపారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించినట్లు తెలిపారు.

'రాహుల్ పాదయాత్ర అడ్డుకోవడం దుర్మార్గం'

ప్రజాశక్తి – ఉండి

ఎఐసిసి మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్రను బిజెపి పాలిత అస్సాం ప్రభుత్వం అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని కాంగ్రెస్ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పిసిసి సభ్యులు వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అస్సాంలోని గౌహతి దగ్గర కళాశాలను సందర్శించడానికి వెళ్తున్న రాహుల్ గాంధీని కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు అస్సాం ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోని ప్రభుత్వం అడ్డుకోవడం దుర్మార్గమన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి – తణుకు రూరల్

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ పాఠశాలలను సందర్శించి ఈ నెల 31వ తేదీ, ఫిబ్రవరి 1వ తేదీన నిర్వహించే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఉధృతంగా ఉద్యమం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సుబ్బారావు, కె.అంజిబాబు, కోశాధికారి హరికృష్ణ, సుజాత పాల్గొన్నారు.

పాలకొల్లులో 'జయహో బిసి'

ప్రజాశక్తి – పాలకొల్లు

రాష్ట్రంలో అధికారంలోకి రానున్న టిడిపి, జనసేన ప్రజా ప్రభుత్వంలో బిసిల అభ్యున్నతి, సంక్షేమమే అజెండాగా పని చేస్తానని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక కిరాణా వర్తకుల సంఘ భవనంలో బుధవారం నిర్వహించిన జయహో బిసి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిసిల అభ్యున్నతి, సంక్షేమం కోరుకునేది టిడిపి మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు జివి, రాష్ట్ర కార్యదర్శి పెచెట్టి బాబు, నియోజకవర్గ సమన్వయకర్త పి.చంద్రమౌళి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, సూర్యప్రకాష్, పొట్నూరి శ్రీను, రాము, షేక్ సిలార్, పాలవలస తులసీరావు, కడలి గోపీ, అందేకోటి వీరభద్రం పాల్గొన్నారు.